క్లుప్తంగా

మురళీకృష్ణకు డాక్టరేట్



నెక్కొండ : మండలంలోని టీకులతండాకు చెందిన బానోతు మురళీకృష్ణ 'టెంపుల్ కల్చర్ ఇన్ తెలంగాణ 800–1687 సీఈఏ హిస్టారిక్ పర్స్పెక్టివ్' అంశంపై చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆయన ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ పర్యవేక్షణలో చరిత్ర విభాగంలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ చరిత్ర విభాగ అధ్యక్షురాలు ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ ఇందిర, డాక్టర్ అరుణ పరిపాటి, డాక్టర్ రమేశ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

కుట్టుమిషన్ అందజేత



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన ముంజల సుజాతకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (కానా) ట్రస్ట్ సమకూర్చిన రూ.20 వేల విలువైన కుట్టుమిషన్, సామగ్రిని స్థానిక వాలంటీర్ నాతి గణేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడారు. సుజాత భర్త ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందగా ఆమె దుస్థితిని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకాంతం, జనగామ జిల్లా అధ్యక్షుడు గద్దం రాజు కానా ట్రస్ట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఈ క్రమంలోనే కానా సభ్యులు స్పందించి కుట్టు మిషన్, సామగ్రి సమకూర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ముత్యం సంపత్, గిరగాని యాదగిరి, ముత్యం పాపయ్య, అంబాల సంపత్, యాకన్న, రాజు, ఎల్లగౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ డిపో బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను డ్యూటీలో ఉన్న హోంగార్డు మంజుల స్వాధీనం చేసుకుని డిపో అధికారుల సమక్షంలో శుక్రవారం అప్పగించింది. ఈ సందర్భంగా హోంగార్డుకు ప్రయాణికురాలు కృతజ్ఞతలు తెలియజేసింది. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సత్వరమే గుర్తించి బాధితురాలికి అప్పగించడం పట్ల ఆర్టీసీ ఉద్యోగులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ప్రతిభ



నెక్కొండ : మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చెలకలపల్లి రితిక, మద్ది శౌర్య, రామకృష్ణ, సాత్విక్ వివిధ గురుకుల పాఠశాలల ప్రవేశాలకు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటారని హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. సదరు విద్యార్థులను స్కూల్ ఆవరణలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశాలు పొందనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, సూరజ్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

'పవన్ కల్యాణ్‌పై విమర్శలు సరికాదు'

నర్సంపేట : జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత విమర్శలు చేయడం సరికాదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు శివకోటి యాదవ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్ సీరియస్ పొలిటీషియన్ కాదని, అనుకోకుండా డిప్యూటీ సీఎం అయ్యారన్న ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను ఖండించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలులో ఆరు నెలలు గడిపిన కవితకు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. కవిత బేషరతుగా క్షమాపణ చెప్పి, వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన

నెక్కొండ : వంట గ్యాస్, చమురు ధరలు పెంపుపై సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నమిండ్ల స్వామి ఆధ్వర్యంలో మండలంలోని సూరిపల్లిలో ప్రజలు శుక్రవారం ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు రాయితీలిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, అనూష, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాంచాల రాయస్వామి జాతర

- జిల్లాలోనే శాయంపేటలో అతి ప్రాచీనమైన శ్రీకృష్ణ దేవాలయం
- నాగెవెల్లి, రథోత్సవంతో రేపు ముగియనున్న రేపు బ్రహ్మోత్సవాలు



పాంచాల రాయస్వామి ఆలయం



శ్రీకృష్ణ భగవానుడి మూలవిరాట్

గీసుకొండ: మండలంలోని శాయంపేటహవేలిలో ప్రాచీనమైన, ఎంతో విశిష్టమైన ఆదిమహాలక్ష్మి సమేత పాంచాల రాయస్వామి జాతర శనివారం వైభవంగా జరుగనుంది. జాతరకు పరిసర గ్రామాల నుంచి భక్తులు ప్రభలు, ఎడ్లబండ్లతో తరలివస్తారు. ఇష్టదైవమైన శ్రీకృష్ణుడికి పూజలు చేసి మొక్కులు సమర్పిస్తారు. ఆదివారం నాగవెల్లి, సాయంత్రం స్వామివారి ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకుడు కొండపాక వంశీకృష్ణమాచార్యులు తెలిపారు.

ఆలయ ప్రాశస్త్యంపై ఎన్నో కథలు..

శాయంపేటలోని పాంచాల రాయస్వామి ఆలయానికి సుమారు 800 ఏళ్ల చరిత్ర ఉందని చెబుతున్నారు. శిలాశాసనాలు, పుస్తకాలు, ప్రజలు ఆలయ ప్రాశస్త్యాన్ని పలువిధాలుగా చెప్పుకుంటారు. పాంచాల రాజైన ద్రుపద మహారాజు కూతురు పాంచాలిగా పిలిచే ద్రౌపదిని దుర్యోధనుడు వస్త్రాపహరణం చేస్తున్న సమయంలో శ్రీకృష్ణుడు ఆమె రక్షించాడు. ఆ స్మృతితోనే శ్రీ కృష్ణుడిని పాంచాల దేశం పాలిటి దైవంగా పిలిచారు. ఆ జ్ఞాపకాలతోనే పాంచాల రాయస్వామిగా పేర్కొని ఆయనకు ఇక్కడే దేవాలయాన్ని నిర్మించారని చెప్పుకుంటారు. అలాగే, ఐదు వృత్తులు పంచబాణులు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారనే మరో కథ ప్రచారంలో ఉంది. కాకతీయ రాజు ప్రతాపరుద్ర చక్రవర్తి పాలిస్తున్న కాలంలో గుడి చుట్టు దట్టమైన అడవి ఉండేది. ఆయనే శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆ తర్వాత కాలక్రమంలో శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని 16వ శతాబ్దంలో సీతాపతి రాజు(సీతాబ్‌ఖాన్) పెద్ద తిరుపతయ్య చేసులో పునరుద్ధరించారని తెలుస్తోంది. అనంతరం మతాంతరులచే ధ్వంసమైన ఆలయాన్ని శ్రీమాన్ కొండపాక వెంకటాచార్యులు తదితరులు అభివృద్ధి చేసినట్లు చెబుతున్నారు.

సుందరమైన స్వామి మూలవిరాట్

స్వామివారి మూలవిరాట్ ఎంతో సుందరంగా ఉంటుంది. ఆయన చతుర్భుజాల్లో కుడివైపున ఉన్న చేతుల్లో శంఖం, అభయహస్తం, ఎడమ చేతిలో చక్రం, గధ ఉన్నాయి. ద్రౌపదిని రక్షించే తొందరలో కుడిచేతిలో ఉండే చక్రాన్ని ఎడమచేతిలో ధరించారనే కథ ఉంది. అలాగే హిందూ మతాన్ని పునరుద్ధరించిన 12 మంది ఆళ్వారుల విగ్రహాలు ఆలయంలో స్వామి వారికి ఇరుపక్కలా ఉన్నాయి.

ఆలయాన్ని దర్శించిన ప్రముఖులు

ఆలయాన్ని గతంలో త్రిదండి శ్రీమన్నారాయణ, పెద్ద, చినజీయర్‌స్వాములతోపాటు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు సందర్శించారు.

ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ఎంతో ప్రాచీనమైన ఆలయం ఆదరణకు నోచుకోవడం లేదు. జిల్లాలోనే ఏకైక ప్రాచీన శ్రీ కృష్ణ దేవాలయ విశిష్టత గురించి గతంలో డిగ్రీ పాఠ్యపుస్తకాల్లో ప్రస్తావించారు. ఇప్పటికైనా అభివృద్ధి పనులు చేపట్టి ఆలయానికి పూర్వవైభవం తేవాలని భక్తులు, శాయంపేట హవేలి గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి



వర్ధన్నపేట : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంజయ్య తదితరులు



సంగెంలో..



రాయపర్తి : తిర్మలాయపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, నెక్కొండ, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, సంగెం, రాయపర్తి, గీసుకొండ తదితర మండలాల్లో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో, ప్రధాన కూడళ్లలో, కార్యాలయాల్లో జ్యోతిబా పూలే చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ ఉన్నతికి పూలే అందించిన సేవలను కొనియాడారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు



డ్రోన్ అందజేస్తున్న హరిబాబు, తదితరులు

ఖానాపురం : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ఆకాంక్షించారు. మండల కేంద్రానికి చెందిన దత్తాత్రేయ స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు బెంగుళూరుకు చెందిన కోలిన్ ఏరో స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.4.50 లక్షల విలువైన డ్రోన్‌ను ఆ సంస్థ బాధ్యులతో కలిసి హరిబాబు శుక్రవారం అందజేశారు. అనంతరం హరిబాబు మాట్లాడారు. సమాజాభివృద్ధిలో మహిళల ఉన్నతి కీలకమన్నారు. కోలిన్ ఏరోస్పేస్ సీఎస్ఆర్ అమిత్ సావర్కర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంస్థ సహకరిస్తోందని తెలిపారు. డ్రోన్‌లకు ఇన్సూరెన్స్ చేయించి అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, కార్యదర్శి సుప్రజ, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు వేజెళ్ల సుజిత, సంస్థ బాధ్యులు లవీన్ సుందరరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పక్షికి పర్యావరణ ప్రేమికుడి సపర్యలు



నర్సంపేట : వేసవి తాపంతో దాహానికి తట్టుకోలేక పట్టణంలో శుక్రవారం పక్షి కింద పడిపోగా నర్సంపేటకు చెందిన పర్యావరణ ప్రేమికుడు, సమాజ సేవకుడు బెజ్జంకి ప్రభాకర్ కింద పడిన పక్షిని చేరదీసి నీటిని తాగించి కాపాడాడు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వేసవిలో పక్షుల దాహాన్ని తీర్చడానికి ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో నీరు, ఆహారంగా బియ్యం, నూకల గింజలు అందుబాటులో ఉంచాలని కోరారు.

వేసవిలో ప్రజలను అప్రమత్తం చేయాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ



మాట్లాడుతున్న వైద్యాధికారి సరోజన

నర్సంపేట : వేసవి కాలంలో ఎండల తీవ్రత నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలని చెన్నారావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ కోరారు. చెన్నారావుపేటలో శుక్రవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ పనులను ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం పనులు, ప్రయాణాలు మానుకోవాలని కోరారు. కూల్ డ్రింక్స్ తాగొద్దని, మసాలాలతో కూడిన ఆహారం తినకూడదని చెప్పారు. మంచినీళ్లు, కొబ్బరినీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణం ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. అవసరమైన వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని ఆశా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ కూలీలకు, ఫీల్డ్ సహాయకులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోండి

- ఎంపీడీఓ శ్రీవాణి



నర్సంపేట : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

నర్సంపేట : ఎండల తీవ్రత నేపథ్యంలో చలివేంద్రాలను బాటసారులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ నల్ల శ్రీవాణి కోరారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. సమాజంలోని ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కత్తెరపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్య భాస్కర్, మాజీ వార్డు సభ్యుడు మేడి సంతోశ్, జిల్లా నాయకులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నవత ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, ఎస్సై మహేందర్ ప్రారంభించి మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు మెండెం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

పర్వతగిరి : మండల కేంద్రంలోని లయోల ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు చిన్నారిని చితకబాదింది. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. పర్వతగిరి గ్రామానికి చెందిన రూపాని సాయికుమార్–వర్ధిని కూతురు లిప్సిక ఎల్‌కేజీ చదువుతోంది. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం స్కూల్‌కు వెళ్లింది. అల్లరి చేస్తున్నావని ఆమెను ఉపాధ్యాయురాలు రమ కర్రతో గట్టిగా కొట్టడంతో ఒళ్లంతా వాతలు వచ్చాయి. కాగా, ఇంటికి వెళ్లిన తర్వాత లిప్సిక తన తల్లిదండ్రులు, మేనమామ ఉపేందర్‌కు తెలిపింది. దీంతో వారు స్కూల్‌కు వెళ్లి యజమాన్యాన్ని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిందని తెలిపారు. ఈ విషయమై స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరగా చిన్న పిల్లలను కొట్టడం తప్పని, గతంలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో కూడా పిల్లలను కొట్టవద్దని ఉపాధ్యాయులకు చెప్పామని, మళ్లీ ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూసుకుంటామని తెలిపారు.

చిన్నారులకు నేత్ర వైద్యశిబిరం



నర్సంపేట : చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్లు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలోని ఒకటో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో ఆరేళ్లలోపు వయస్సున్న చిన్నారులకు శుక్రవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి బాలలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. చిన్న పిల్లలను సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులకు దూరంగా ఉంచాలని చెప్పారు. పిల్లలకు ఆకుకూరలు, కూరగాయాలు ఎక్కువగా తినిపించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జులేఖ, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో గ్రామీణ హితకారిణి సేవా సంఘం ఆధ్వర్యంలో శరత్ కంటి ఆస్పత్రి నిర్వాహకులు శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా సేవా సంఘం చైర్మన్ గటిక మల్లయ్య మాట్లాడారు. గ్రామస్తులు ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం

- డీఈఈ తిరుపతి



పనులను పరిశీలిస్తున్న డీఈఈ తిరుపతి

నర్సంపేట : గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసినట్టు డీఈఈ తిరుపతి, చెన్నారావుపేట ఏఈ జోగానంద్ తెలిపారు. ఈనెల 8, 9 తేదీల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతోపాటు చెట్ల కొమ్మలు పడి విద్యుత్ తీగలు నేలకూలాయి. అమీనాబాద్‌లో 16, సూర్యాపేటతండా, పత్తినాయక్‌తండాలో 22 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాలను ఏర్పాటు చేయించి నేలవాలిన విద్యుత్ ఈగలను సరిచేయించినట్లు తెలిపారు. ఎక్కడ కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు.

గుడుంబా విక్రేతల రిమాండ్



గీసుకొండ : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఐదుగురు గుడుంబా విక్రేతలను రిమాండ్‌కు తరలించినట్టు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. ఎలుకుర్తికి చెందిన బొడిగ దేవేంద్ర, జాన్‌పాక్‌కు చెందిన భూక్య లలిత, బోడ బుజ్జి, మనుగొండకు చెందిన ఎంబాడి మల్లమ్మ, గుర్రం దేవి పలుమార్లు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడటంతోపాటు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో వారిని తహసీల్దార్ రియాజుద్దీన్ ఎదుట హాజరుపర్చగా వారిని రిమాండ్ విధించడంతో నర్సంపేట మహిళా జైలుకు తరలించినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, సిబ్బంది లక్ష్మణాచారి, సత్తయ్య, రవీందర్, శ్రీనివాస్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేక పూజలు



అభిషేక పూజలు నిర్వహిస్తున్న చైర్మన్, భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో ఉత్తరాషాడ నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహానికి అభిషేకాలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హనుమాన్ మాల ధరించగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాధవశంకర్ మాట్లాడారు. ఆలయంలో అన్ని మాసాల్లో ఉత్తరాషాడ నక్షత్రాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, శ్రీరామ్ ఈశ్వరయ్య, ఇరుకుల్ల వీరలింగం, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మినారాయణ, మదనపెల్లి సత్యనారాయణ, శింగిరికొండ రవీందర్, తోట బాలభాస్కర్ గుప్తా, బండారుపల్లి చెంచారావు, శ్రీరాం కిరణ్, దొడ్డ వేణు, మల్యాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

'బాధిత రైతులను సత్వరమే ఆదుకోవాలి'



వినతిపత్రం ఇస్తున్న బాబు, నాయికులు

నర్సంపేట : రెండ్రోజుల క్రితం కురిసిన వడగళ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. వడగళ్ల వర్షానికి వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులు భారీగా నష్టపోయారని తెలిపారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోరబోయిన కుమారస్వామి, నాయకులు జినుకల చంద్రమౌళి, లక్క రాజు, నర్సింహరాములు, కార్తీక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

నర్సంపేట రూరల్ : భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లికి చెందిన చోడ మల్లేశ్ ఈనెల 8న అతడి భార్య అనూషను చితకబాదాడు. ఆమె ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోండి

- ఎంపీడీఓ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ కోరారు. మండలంలోని జమాల్‌పురంలో ఉపాధి పనులను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్ నుంచి వేతనం రూ.307 చొప్పున ఇస్తారని చెప్పారు. కూలీలు కొలతల ప్రకారం పని చేసి లబ్ది పొందాలని సూచించారు. పనుల్లో భాగంగా సహజ వనరుల అభివృద్ధి, నీటి నిల్వ, సంరక్షణ, భూమి అభివృద్ధి పనులు, అజోల్లా యూనిట్ ఏర్పాటు, నాడెప్ కంపోస్ట్ పిట్ తదితర పనులు చేపట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు దివ్య, పాషా, ఎఫ్ఏ కవిత తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బోయినపల్లి రంగారావు(85) శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన గురువు అయిన రంగారావు అంతిమయాత్రలో ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని పాడె మోశారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



ప్రతిజ్ఞ చేయిస్తున్న రవీందర్‌రెడ్డి

రాయపర్తి : మండలంలోని ఆరెగూడెం, కొలన్‌పల్లి, జయరాంతండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భారత రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో జై భీమ్, జై బాపు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, పాల్వంచ కోటేశ్వర్, గారె భిక్షపతి, ఎల్లారెడ్డి, గజ్జి వెంకటయ్య, గజ్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవరావు స్ఫూర్తిని కొనసాగించాలి



నర్సంపేట : శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట యోధుడు పైలా వాసుదేవరావు పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వాసుదేవరావు 11వ వర్ధంతి నిర్వహించారు. వాసుదేవరావు చిత్రపటానికి న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యూ, ఏఐకేఎంఎస్, పీవైఎల్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. వాసుదేవరావు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ఆదివాసీల అభ్యున్నతి కోసం ఆయుధాన్ని చేతపట్టి నూతన సమాజ నిర్మాణం కోసం పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గట్టి కృష్ణ, గొర్రె ప్రదీప్, పూలక్క, రాజు, మల్లయ్య, వెంకటస్వామి, రాజు, అశోక్, భద్రాద్రి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.